ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 12 నవంబరు 2025



చలికాలం జాగ్రత్త

- న్యూమోనియా వ్యాపించే ప్రమాదం
- చిన్నపిల్లలు, వృద్ధులపై అధిక ప్రభావం
- నేడు ప్రపంచ న్యూమోనియా దినం

6లో



ఈసారైనా కనికరిస్తారా?

- ఏనుగుల తరలింపులో జాప్యం
- పునరావాస కేంద్రం పనులు నత్తనడక
- వాటి దాడిలో మృతి చెందుతున్న ప్రజలు
- పంటలు సర్వ నాశనం
- గజరాజులు కూడా మృత్యువాత పడుతున్న వైనం



భామిని మండలంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన నాలుగు ఏనుగులు (ఫైల్)

ఏనుగుల దాడిలో మృతి చెందిన వారు..

మండలం	మృతులు
కురుపాం	11
పార్వతీపురం	7
సీతంపేట	4
వీరఘట్టం	3
భామిని	2
మొత్తం	27

- ఏనుగుల దాడిలో ఇప్పటి వరకు జిల్లాలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.
- గత 27 ఏళ్లలో కురుపాం పరిధిలో 3 ఏనుగులు, భామిని పరిధిలో 4, పార్వతీపురం పరిధిలో 4 మొత్తం 11 ఏనుగులు మృత్యువాతపడ్డాయి.

జియ్యమ్మవలస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. జనావాసాల మధ్య సంచరిస్తూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. వరి, టమాటా, మొక్కజొన్న తదితర పంటలతో పాటు మోటారు ఇంజన్లు, డ్రిప్ ఇరిగేషన్ పైపులను ధ్వంసం చేస్తున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒంటరిగా బయటకు వెళ్లలేకపోతున్నారు. పొలాలకు వెళ్లేందుకు కూడా సాహసించడం లేదు. ఇప్పటికే గజరాజుల దాడిలో పదుల సంఖ్యలో ప్రజలు మృతి చెందారు. వేలాది ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. మరోపక్క ఏనుగులు కూడా ప్రమాదాలకు గురై మృత్యువాతపడుతున్నాయి. ప్రస్తుతం పాలకొండ డివిజన్‌లో ఒక గుంపు, పార్వతీపురం డివిజన్‌లో మరో గుంపు మొత్తం 14 ఏనుగులు జిల్లాలో సంచరిస్తున్నాయి. వీటి తరలింపునకు ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమయ్యాయి. కనీసం పునరావాస కేంద్రం పనులైనా పూర్తిచేసి ఆ ప్రదేశానికి తరలించాలని జిల్లా ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు.

27 ఏళ్లుగా విధ్వంసం..

1998 అక్టోబరు 2న ఒడిశా రాష్ట్రంలోని లఖేరీ అభయారణ్యం నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కురుపాం మండలం పనసభద్ర గ్రామ పరిసరాల్లోకి 11 ఏనుగులు ప్రవేశించాయి. అప్పటి నుంచే ఇవి విధ్వంసం సృష్టిస్తున్నాయి. పాలకొండ రేంజ్ పరిధిలోకి 2007లో మరో 8 ఏనుగులు ప్రవేశించాయి. ఇవీ కూడా బీభత్సం సృష్టిస్తున్నాయి. ఏనుగులు నాశనం చేసిన పంటలకు సంబంధించి నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చి న్యాయం చేయాల్సిన రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు పత్తా లేకుండా పోతున్నారు. అటవీశాఖ మాత్రం తెలిసీతెలియని అంచనాలు వేసి (మిగతా 8వ పేజీలో..)



ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

కొమరాడ మండలంలో తిష్ఠ

కొమరాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొన్ని రోజులుగా ఏనుగుల గుంపు తిష్ఠవేసింది. పూజారిపేట, సిడిపల్లి గ్రామాల మధ్య ఏనుగులు సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వరి, పత్తి పంటలను నష్టపరుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సిబ్బంది సూచిస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



పూజారిపేట, సిడిపల్లి గ్రామాల మధ్య సంచరిస్తున్న ఏనుగులు

నేడు నూతన గృహ ప్రవేశాలు



పార్వతీపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేరనుంది. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను బుధవారం ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణ లబ్ధిదారులకు ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేసింది. సొంత స్థలం ఉన్నవారికి గృహాల మంజూరు చేసింది. జిల్లాలో సాలూరు, పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో పూర్తయిన ఇళ్లకు సంబంధించి బుధవారం గృహ ప్రవేశాలు నిర్వహించనున్నారు. సాలూరులో జరిగే కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, కురుపాంలో ప్రభుత్వ విప్ తోయక జదీశ్వరి, పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, పాలకొండ నగర పంచాయతీలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పాలకొండ సబ్ కలెక్టర్ పాల్గొననున్నారు.

జనవరిలో శంబర జాతర



శంబర పోలమాంబ

మక్కువ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ జాతర వచ్చే ఏడాది జనవరిలో జరగనుంది. జనవరి 26 నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశమై తేదీలను ఖరారు చేశారు. 26న తొలేళ్లు, 27న సిరిమానోత్సవం, 28న అనుపోత్సవం నిర్వహించనున్నారు. దీనికి ముందు నిర్వహించే పెద్దమ్మవారి ఉత్సవాల తేదీలను కూడా ప్రకటించారు. వచ్చే నెల(డిసెంబరు) 22న పెద్దమ్మవారిని గ్రామంలోకి తెచ్చేందుకు చాటింపు వేస్తారు. 29న పెద్దమ్మవారిని గ్రామంలోకి తీసుకువస్తారు. వచ్చేఏడాది జనవరి 5 తొలేళ్లు, 6న ప్రధానోత్సవం, 7న అనుపోత్సవం జరగనుంది. అదేరోజున చిన్నమ్మవారు (శంబరపోలమ్మ) జాతరకు చాటింపువేస్తారు. 12న చిన్నమ్మను గ్రామంలోకి ఆహ్వానించి చదురుగుడిలో గద్దెదించనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

కొనలేం.. తినలేం

- కొండెక్కిన కూరగాయల ధరలు
- కిలో రూ.80 పలుకుతున్న బీరకాయలు, క్యారెట్
- సామాన్య, మధ్యతరగతి ప్రజల బెంబేలు



పాలకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు కొండెక్కాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వాటి ధరలు పైపైకి వెళ్తున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా ధర అందుబాటులో లేకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఏం కొనలేం.. ఏం తినలేం అన్నట్టుగా పరిస్థితి తయారైంది. అధిక వర్షాలతో జిల్లాలో రైతులు కాయగూరలు పండించలేని పరిస్థితి తలెత్తింది. దీనికి తోడు మొంథా తుఫాన్ కూరగాయల పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతో వాటి ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. గత నెల వరకూ ఏ కూరగాయ ధర అయినా కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండేది. ప్రస్తుతం అన్నిరకాల కాయగూరలు ధరలు కిలో రూ.60 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. ప్రస్తుతం కిలో బీరకాయలు రూ.80, చిక్కుడు రూ.50, టమాటా రూ.50, క్యారెట్ రూ.80, వంకాయలురూ.60, బీట్‌రూట్ రూ.80, దొండకాయలు రూ.50 (మిగతా 8వ పేజీలో..)

వినియోగం తగ్గించాం

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు అధికంగా ఉన్నాయి. రూ.500 తీసుకెళ్తేగానీ ఆరు రకాల కూరగాయలు రావడం లేదు. ప్రస్తుతం ఏ కూరగాయ కొనాలన్నా కేజీ రూ.60 నుంచి రూ.80 ఉంటుంది. దీంతో కూరగాయల వినియోగం తగ్గించాం.

-కె.సూరీడమ్మ, పాలకొండ

పర్యాటకానికి స్వర్గధామం మన్యం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వం గిరిజన గ్రామాలు అంటే కేవలం డోలీ మోతలనే అనేలా చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అడవి బిడ్డల అభివృద్ధికి బాటలు వేస్తూ ఇక్కడి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తుంది. పర్యాటకానికి స్వర్గధామంగా మన్యం జిల్లా మారింది.' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. కురుకూటి పంచాయతీ దళాయివలస గ్రామ సమీపంలో అడపరాయి జలపాతాన్ని (వాటర్‌ఫాల్స్) మంగళవారం ఆమె ప్రారంభించారు. జలపాతం వద్ద గిరిజనులు, అధికారులు ఏర్పాటు చేసిన షాపులతో పాటు ప్రకృతి అందాలను, జలపాతాల సోయగాలను ఆమె తిలకించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఊటీ, కొడైకెనాల్, అరకు, లంబసింగి అందాలకు మించేలా జిల్లాలో అనేకచోట్ల వాటర్ ఫాల్స్ ఉన్నాయన్నారు. 11 నుంచి 14 జలపాతాలను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశామని అన్నారు. ఇప్పటికే మొగనాళి, అడపరాయి వద్ద జలపాతాలు ప్రారంభించామని, త్వరలో తోణాం సమీపంలోని ఉన్న శిఖపరువు, భామిని, కురుపాంలోని వాటర్ ఫాల్స్‌ను కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయం మేరకు వీటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా చేయడమే లక్ష్యమని అన్నారు. పర్యాటకులు రాత్రివేళల్లో బస (మిగతా 8వ పేజీలో..)



అడపరాయి జలపాతాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

రైతులు ప్రకృతి వ్యవసాయానికి

ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి
- వెంకటభైరిపురంలో 'పొలంబడి'



వెంకటభైరిపురంలో వరి పైరుని పరిశీలిస్తున్న కలెక్టర్

మక్కువ రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు ఇకనుంచి రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని వెంకటభైరిపురంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడులు, విత్తనాలు, ఎరువులు ఏవిధంగా అందుబాటులో ఉన్నాయో వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారులు, రైతు సేవాకేంద్రాల సిబ్బంది అన్నివేళలా రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వచ్చే కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం (మిగతా 8వ పేజీలో..)



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఆజాద్ ఆశయ సాధనకు కృషి

- జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి జేసీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధులని, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని అన్నారు. విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడే ఐఐటీ, విద్య, అకాడమీ ఏర్పాటు వంటి నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశా ఖాధికారి షరీఫ్, జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం హుస్సేన్, ఉపాధ్యక్షుడు షరీఫ్ రజాక్ తది తరులు పాల్గొన్నారు.

సింగపూర్ పర్యటనకు శంకరరావు మాస్టారు

- విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు పయనం

6లో

డీసీసీబీ అభివృద్ధికి సమష్టి కృషి

- చైర్మన్ కిమిడి నాగార్జున

6లో

విద్యార్థినుల మరణాలపై

ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

- కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం
- నేడు పాఠశాలకు వెళ్లనున్న కమిషన్ సభ్యులు



కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాల

పార్వతీపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుపాం గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఇద్దరు విద్యార్థినుల మరణించడంతో పాటు పలువురు విద్యార్థినులు పచ్చకామెర్ల బారినపడడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ ఆర్‌సీ-ఢిల్లీ) విచారణ చేపట్టింది. ఈ మేరకు కమిషన్ సభ్యులు యాటి ప్రకాష్ శర్మ, సంజయ్‌కుమార్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థినుల మరణాలు, అనారోగ్యానికి గురికావడంపై విచారణ చేపట్టారు. ఎంపీడీవోతో పాటు మండల విద్యాశాఖాధికారి తదితరులు గురుకుల విద్యాలయాన్ని సందర్శించారా?.. లోపాలు ఏమైనా గుర్తించారా?, పాఠశాల అభివృద్ధికి మంజూరైన నిధులు, పారిశుధ్య పనులకు కేటాయిస్తున్న నిధులు, ఆహారం, తాగునీరు తదితర విషయాలపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు సమాచారం. కమిషన్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు కొంతమంది అధికారులు ఉక్కిరిబిక్కిరైనట్లు తెలిసింది. బుధవారం కురుపాం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టనున్నారు. విద్యార్థుల ఇళ్లకు కూడా వెళ్లనున్నట్లు సమాచారం. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి మీడియాను అనుమతించలేదు.



అబ్బో ఎంత చలి..!

భోగాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భోగాపురం నుంచి బంటుపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో మంగళవారం ఉదయం కనిపించిన దృశ్యం. చలితీవ్రత పెరిగిన నేపథ్యంలో ఓ కుక్క, తన పిల్లలతో ఇలా షెల్టర్ తీసుకుంది. అటుగా వెళ్లే వారంతా ఒక దగ్గరకు చేరిన కుక్క, పిల్లలను ఆశ్చర్యంగా చూశారు. ఫొటోలు తీసుకున్నారు.

డీసీసీబీ అభివృద్ధికి సమష్టి కృషి

- చైర్మన్ కిమిడి నాగార్జున

విజయనగరం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే డీసీసీబీ అభివృద్ధి సాధ్యమని ఆ బ్యాంకు చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. మంగళవారం విజయనగరంలోని ఓ హోటల్‌లో ఇటీవల నియమితులైన 46 మంది పీఏసీఎస్ చైర్మన్లతో శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌లను పటిష్ఠం చేసేలా చైర్మన్లు దృష్టి సారించాలన్నారు. సొసైటీల ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు రుణాలను అందజేస్తామన్న విషయాన్ని అవగాహన కల్పించాలని కోరారు. నాలుగు నెలల్లో రూ.25 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరించినట్లు చెప్పారు. డిపాజిట్లపై గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలన్నారు. పీఏసీఎస్ బైలా రూల్స్ క్రాప్ యాక్ట్, పీఐసీ విధులు, అధికారాలు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. అప్పు తీసుకుని తిరిగి చెల్లించని వ్యక్తులను ఉపేక్షించేది లేదని,వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీవో రమేష్, సీఈవో ఉమా మహేశ్వరరావు, డీఆర్ ఈశ్వరరావు, డైరెక్టర్ సత్య నారాయణ, సూర్యనారాయణ, నరసింహారావు, ఆర్‌వీ రమణ, బీఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగార్జున

సింగపూర్ పర్యటనకు శంకరరావు మాస్టారు

- విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు పయనం



బౌరోతు శంకరరావు

పాలకొండ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఇటీవల ఎంపికైన పాలకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన సంస్కృత ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో కలిసి సింగపూర్ వెళ్లనున్నారు. సంస్కృత ఉపాధ్యాయుడు శంకరరావు సేవలను గుర్తించిన ప్రభుత్వం సింగపూర్ పర్యటనకు ఆయన్ని ఎంపిక చేసింది. ఈ నెల 27న మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో శంకరరావుతో పాటు మరికొందరు ఉపాధ్యా యుల బృందం సింగపూర్ వెళ్లనున్నారు. అక్కడ ప్రముఖ విద్యావేత్తలతో ను కలిసి పాఠశాలలో విద్యావిధానం, బోధనా పద్ధతులు తదితర అంశాలపై అధ్యాయనం చేయనున్నారు. సింగపూర్ పర్యటనకు శంకరరావు ఎంపి కపై పలు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

చలికాలం.. జాగ్రత్త





- వేపాడ మండలంలోని ఓ గ్రామా నికి చెందిన దంపతులు ఉద్యోగరీత్యా విశాఖపట్నంలో ఉంటున్నారు. రెండేళ్ల క్రితం వీరికి కొడుకు పుట్టాడు. ఈ ఆనందంతో స్వగ్రామానికి వచ్చారు. శిశువు ఊపిరి అడక ఉక్కిరిబిక్కిరవుతుండడాన్ని గమనించారు. సమీపంలోని వైద్యుని వద్దకు చూపించగా.. విశాఖలోని చిన్న పిల్లల వైద్యునిపుణుకి చూపించాలని సలహా ఇచ్చారు. అక్కడికి తీసుకెళ్లగా ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరి.. న్యూమోనియా లక్షణాలు ఉన్న వైద్యులు నిర్ధారించారు. చికిత్స అందించారు. బాలుడు తేరుకున్నా ఇప్పటికీ తరచూ జలుబు, ముక్కుదిబ్బడ, ఊపిరి అడక ఇబ్బంది పడుతున్నాడు. దీంతో శ్వాస అందించేందుకు ప్రత్యేక యంత్రం సమకూర్చుకోవాల్సి వచ్చింది.
- లక్కవరపుకోట ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి నుంచి ఏడాది కాలంలో 25 మందిని, కొట్టాం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఐదుగురిని ఈ లక్షణాలతో ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. సాధారణ జలుబు, దగ్గుగా తేల్చారు. ప్రాథమిక ఆసుపత్రులకు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఎగపోత, పక్కటెముకలు ఎగరడం, ఊపిరి పీల్చుకోలేకపోవడం వంటి లక్షణాలతో వచ్చేవారిని వెంటనే ప్రభుత్వ, సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ఇక్కడ నిర్ధారణ అయితే విజయనగరం ఘోషాసుపత్రి, విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తున్నారు.

- న్యూమోనియా వ్యాపించే ప్రమాదం
- ఊపిరి ఆడనివ్వకపోవడంతో ఉక్కిరిబిక్కిరి
- చిన్నపిల్లలు, వృద్ధులపై అధిక ప్రభావం
- అలసత్వం వహిస్తే ప్రాణాలకే ముప్పు
- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ న్యూమోనియా దినం

శృంగవరపుకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ న్యూమోనియా బారిన పడకుండా పీసీవీ (న్యూమోకాకల్, కంజుగేట్ వ్యాక్సిన్)ను అందిస్తోంది. భారత ప్రభుత్వం 2017లో ఈ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. నెల పదిహేను రోజులకు ఒకడోసు, మూడు నెలల పదిహేను రోజు లకు రెండో డోసు, పది నెలలకు మూడో డోసు టీకాను ఆరోగ్య కార్యకర్తలు (ఎఎన్‌ఎం)లు ఇస్తు న్నారు. దీంతో పిల్లల్లో ఈ వ్యాధి లక్షణాలు పెద్దగా కనిపించకపోవడంతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ వద్ద న్యూమోనియాపై కచ్చితమైన లెక్కలు లేవు. అయినా అప్పుడప్పుడు చిన్నపిల్లలు, వృద్ధులు, డయాబెటిక్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిలో పలువురు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ ఆసుపత్రులకు వస్తున్నారు. వీరికి నెబ్యులైజేషన్ (ద్రవ ఔషధాల పొగ మంచు)ను ప్రత్యేక యంత్రం ద్వారా నిర్ధిష్ట సమయం ఊపిరితిత్తుల్లోకి పంపించి ఉపశమనం కలిగిస్తున్నారు. లక్షణాలు కనిపిస్తున్నవారంతా న్యూమోనియాకు గురికానప్పటికీ నిర్లక్ష్యం చేస్తే ఈ వ్యాధి బారిన పడకతప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చలికాలంలో ఎక్కువ..

ఈ వ్యాధి చిన్నపిల్లలు, వృద్ధులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. వ్యాధిని ఎంత త్వరగా గుర్తించి చికిత్స పొందితే అంత మేలు. ప్రస్తుతం చలికాలం. చిన్నారులు, వృద్ధుల్లో శ్వాస సంబంధిత సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. దీంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి వస్తే ఊపిరితిత్తులు సంకోచానికి గురవుతాయి. రెండు ఊపిరితిత్తుల్లోనూ ఫ్లూయిడ్ నిండడంతో వాటి పనితీరుపై ప్రభావం చూపుతుంది. దీంతో ఎడతెరిపి లేకుండా దగ్గు, తెమడ వస్తాయి. శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బంది పడతారు. జ్వరం, వణుకు వేధిస్తాయి. వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ కారణంగా న్యూమోనియా రావచ్చు. అన్ని జబ్బులకు ఉన్నట్లే న్యూమోనియాకు వివిధ దశలు ఉన్నాయి. ఒక్కో దశలో ఒక్కో విధమైన లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలను మొదట్లోనే గుర్తిస్తే చాలా సులువుగా వ్యాధి నుంచి బయటపడవచ్చు. నిర్లక్ష్యం చేస్తే దశలను దాటుకుంటూ వెళ్లి ప్రమాదకరంగా మారుతుంది. ఆహారం, శీతలపానీయాలు, లాలాజం ద్వారా ఎక్కువ మొత్తం బ్యాక్టీరియా ఫంగస్ వెళ్లినప్పుడు అసోసియేటెడ్ న్యూమోనియా, అస్పిరేషన్ న్యూమోనియాలకు గురయ్యే ప్రమాదం ఉంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ జబ్బు త్వరగా సోకుతుంది. విపరీతంగా కలుషిత గాలి పీల్చడం, హానికరమైన రసాయనాలు గాలి ద్వారా లోపలికి వెళ్లడం వల్ల లంగ్స్‌పై ప్రభావం చూపి న్యూమోనియాకు దారి తీస్తుంది. ఛాతీలో విపరీతంగా నొప్పి వస్తుంది. మతిమరుపు వచ్చే ఆస్కారం ఉంది. తరచూ చెమట పట్టడం, జ్వరం, నీరసం, కళ్లు తిరిగినట్టుగా అనిపించడం వంటి లక్షణాలు ఉంటాయి. పిల్లలతో పోల్చి చూస్తే పెద్ద వారిలో శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది. వాంతులు, డయోరియా వంటివి కూడా ఇబ్బంది పెడతాయి. జిల్లాలో ప్రతి మండలంలోనూ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గాల్లో ప్రభుత్వ సామాజిక, ప్రాంతీయ ఆసుపత్రులు, జిల్లా కేంద్రంలో కేంద్ర ఆసుపత్రి, వైద్య కళాశాల ఉన్నాయి. న్యూమోనియా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఈ ఆసుపత్రులను సంప్రదించాలని వైద్యులు చెబుతున్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

న్యూమోనియా బారిన పడకుండా ఉండాలంటే మెదటిగా చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కలుషిత వాతావరణానికి దూరంగా ఉండాలి. జలుబు, దగ్గు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆసుపత్రులకు వెళ్లాలి. వీటికి చికిత్స తీసుకోకుంటే న్యూమోనియాగా మారే ప్రమాదం ఉంది. వైద్యుల సలహా పాటించాలి. వీలైనంత వరకు మాస్కు ధరించాలి. ఈ వ్యాధి బారిన పడిన వారు ఎలాంటి ఆందోళన చెందవసరం లేదు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. దీని బారిన పడకుండా శిశువులకు వైద్య ఆరోగ్య శాఖ వ్యాక్సిన్‌ను అందిస్తుంది.

-డాక్టర్ జె.రాజశేఖర్, చిన్నపిల్లల వైద్యులు, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి, శృంగవరపుకోట

చిత్రజ్యోతి

SINCE 1965

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

- కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.
- నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్న గారి 'మూగ మనుసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్ర్కీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్ర్కీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

పీఆర్ రోడ్లపై నివేదిక ఇవ్వాలి

● సురక్షిత తాగునీటిని అందజేయాలి
● కలెక్టరు రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీరాజ్ రహదారులపై వారంరోజుల్లో సమగ్ర నివేదికను ఇవ్వాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీఆర్ పరిధిలోని సీసీ,బీటీ, డబ్ల్యూబీఎం, మట్టిరోడ్ల స్థితిగతులపై సర్వేచేసి నివేదిక ఇవ్వాలని కోరారు. రోడ్ల పొడవు, వాటి పరిస్థితి చేయాల్సిన చిన్న, పెద్ద మరమ్మతులు, అయ్యేవ్యయం తదితర సమగ్ర వివరాలను అందజేయాలని తెలిపారు. కుళాయిలు ద్వారా సురక్షత తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.నిర్మాణంలో ఉన్న రహదారులు, తాగునీటి పథకాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.సమావేశంలోని సీపీవో బాలాజీ, ఎస్ఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

ఇష్టానుసారంగా రోడ్ల పక్కన చెత్తవేసే వారిపై కఠినచర్యలు తీసు కోవాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు.చెత్త వేసేవారిపై సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు ద్వారా గుర్తించాలని సూచించారు. చెత్త వేసినట్లు నిర్ధారణ అయినవారికి రూ.లక్షకు తక్కువ కాకుండా జరిమాన విధించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో నగర, పురపాలక సంస్థలు, నగర పంచాయతీల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను రోడ్ల పక్కన పడేయడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా, వాహనచోదకులకు ఇబ్బందికలుగుతుందని తెలిపారు. పారిశుధ్య సిబ్బంది కూడా దీనిపై నిఘా పెట్టాలని సూచించారు. ప్రజలకు సురక్షిత తాగునీటి అందజేయాలని కోరారు. రీసైక్లింగ్ చేసిదాని నిర్వహణకు అవసరమైన ఆదాయాన్ని సంపాదించాలని సూచించారు.మురుగునీటి నిర్వహణ కోసం ఎస్టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని చెప్పారు. సమావేశంలో సీపీవో బాలాజీ, పబ్లిక్ హెల్త్ ఈఈ జ్యోతి, మునిసిపల్ కమిషనర్లు నల్లనయ్య, అప్పలరాజు, రామలక్ష్మి, శ్రీనివాసరావు, జయరాం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టరు రామసుందర్ రెడ్డి

రైవాడ కాలువపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధుల మంజూరు

● జీవీఎంసీ ఈఈ మురళీకృష్ణ

శృంగవరపుకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైవాడ కాలువపై గల బ్రిడ్జిల నిర్మాణానికి కోటి, 34.65 లక్షలు మంజూరయ్యాయని జీవీఎంసీ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. వేపాడ మండలంలోని కృష్ణారాయుడుపేట సమీపంలో కొత్తవలస-దేవరాపల్లి వద్ద రోడ్లు భవనాలశాఖ రహదారిలో గల రైవాడ కాలువపై గల బ్రిడ్జి, బల్లంకి రహదారిలో గల బ్రిడ్జిలు ఐదునెలల కిందట కూలిపోయిన విషయం విదితమే. ఈనేపథ్యంలో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో కొత్తగా బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి జీవీఎంసీ అధికారులను కలిశారు.ఈనేపథ్యంలో జీవీఎంసీ అధికారులు కొత్తవలస- దేవరాపల్లి రహదారిలో కూలిపోయిన బ్రిడ్జి నిర్మాణానికి రూ.91 లక్షలు, బల్లంకి రోడ్డులో రైవాడ కాలువపై కూలిపోయిన బ్రిడ్జి నిర్మాణానికి 43.65 లక్షలు మంజూ రయ్యాయని విశాఖ జీవీఎంసీ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు కొత్తవలస -దేవరాపల్లి రోడ్డులో కూలి పోయిన బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు ప్రారంభానికి స్థలాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. తొలుత కాలువ ద్వారా జీవీఎంసీకి వెళ్తున్న నీటిని డైవర్ట్ చేసి బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభి స్తామని తెలిపారు. బ్రిడ్జి పనులు ఈనెల 23న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చేతుల మీదగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్ర మంలో డీఈఈ వీరయ్య, ఏఈ మోహన్, వర్క్ఇన్‌స్పెక్టర్లు పోలినాయుడు, అప్పారావులు పాల్గొన్నారు.

వాహనపూజ చేయించి తిరిగి వస్తుండగా..

●పోలాకి మండలంలోని జడూరు జంక్షన్‌లో మినీ వ్యాన్‌ను ఢీకొన్న లారీ
● సిరిపురానికి చెందిన 18 మందికి గాయాలు.. వీరిలో నలుగురు చిన్నారులు


లారీ ఢీకొనడంతో నుజ్జైన మినీ వ్యాన్

నరసన్నపేట/పోలాకి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వారంతా ఒకే కుటుంబానికి చెందినవారు. కొత్తగా కొనుగోలుచేసిన వాహనానికి (మినీవ్యాన్) పూజలు చేసేందుకు ఇంటి నుంచి మంగళవారం ఉదయం బయలుదేరారు. దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా.. పోలాకి మండలం జడూరు జంక్షన్‌లో వెనుక నుంచి వచ్చిన ఓ లారీ ఓవర్‌టాక్ చేస్తూ వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ వ్యాన్ అదుపు తప్పి.. డివైడర్ మీదుగా అవతల రోడ్డుపైకి వెళ్లింది. ఈ సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సిరిపురం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు కొత్తగా వాహనం (మినీ వ్యాన్) కొనుగోలు చేశారు. వాహనానికి పూజ చేయించేందుకు 19 మందితో కలిసి మంగళవారం బయలుదేరారు. తొలుత కోటబొమ్మాళి మండలంలో గల కొత్తమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అక్కడి నుంచి టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామిని దర్శించుకుని తిరుగి పయనమయ్యారు. తామరాపల్లి సమీపాన జడూరు జంక్షన్‌కు చేరుకునే సమయంలో ఓ లారీ వెనుక నుంచి వస్తూ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 18 మంది గాయపడగా.. ఐదుగురి పరిస్థితి విషమమంగా ఉంది. టి.సూరిబాబుకి కాలు విరిగిపోగా, అతడి భార్య విజయ్ నడుమకు గాయాలయ్యాయి. టి.జయద్రిశ్రీ, టి.ప్రణీత, కె.దాలినాయుడు, కె.హరిక, కలివరపు అప్పారావు, కలివరపు సంధ్య, దువ్వరపు అప్పన్న, డి.ఈశ్వరరావు, సాయి, శ్యామలరావు, లక్ష్మీకాంతమ్మ, లక్ష్మీతులసీతో పాటు మరో నలుగురు చిన్నారులు గాయపడ్డారు. స్థానికుల సాయంతో 108వాహనం, హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను నరసన్నపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలాకి ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పశు వైద్య శిబిరం వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే

భోగాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాన్ని రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. మంగళవారం మండలంలోని రావాడ్రలో పశువైద్య శిబిరం ప్రారంభించారు.ఈ సందర్భంగా 145 పశువులకు చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడినాయుడు, సూర్యనారాయణమూర్తిరాజు పాల్గొన్నారు.


భోగాపురం: మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

●సంతకవిటి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆడ దూడల ఉత్పత్తి పథకాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ సత్యప్రకాష్ తెలిపారు. ముకుందపురంలో పశుగణాభి వృద్ధి సంస్థ, పశు సంవ ర్ధక శాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు.

●గంట్యాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ మురళికృష్ణ తెలిపారు. గింజేరులో పశువైద్య శిబిరం నిర్వహించారు.

వరి కోతలపై అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి):వరికోతలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయాధికారుల సూచనలు,సలహాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తెలిపారు. మంగళవారం ముచ్చర్లలో పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19, 20తేదీల్లో తుఫాన్‌పై వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 15నుంచి ధాన్యం కొనుగోలుపై విధివిధానాలను అధికారులు రైతులకు తెలియజేయాలన్నారు.

భూములపై హక్కులు కల్పించాలి

లక్కవరపుకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చిన్నపాలెం భూములపై రైతులకు హక్కు కల్పించాలని జిల్లా రైతు కూలీ సంఘం నాయకులు మొయ్యి దేముడుబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ అప్పలరాజుకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. చిన్నపాలెం రెవెన్యూలో సుమారు 1200 ఎకరాల ఇనాం భూములకు వందేళ్ల గడుస్తున్నా రైతులకు హక్కు కల్పించలేదని పేర్కొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహనీయులు త్యాగాలను స్మరించుకుని వారి అడుగుజాడల్లో నడిచుకోవాలని ఇన్‌చార్జి జేసీ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బిర్సాముండాకు ఘన నివాళి

శృంగవరపుకోట, నవంబరు 11 (ఆంధ్ర.జ్యోతి): ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివాసీ స్వాతంత్ర సమరయోధుడు భగవాన్ బిర్సా ముండాకు ఘన నివాళులర్పించారు. బిర్సాముండా జయంతి పురస్కరించుకుని ఎస్.కోటలో వివిద ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, అధికారులు విద్యార్థులతో కలిసి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.ప్రిన్సిపాల్ కేశవరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్వాసితులకు రైతుల సంఘీభావం

ఎస్.కోట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర వద్ద జిందాల్ కంపెనీ నుంచి తమ భూములు వెనక్కి ఇప్పించాలని 146 రోజులుగా నిరసన తెలుపుతున్న నిర్వాసితులకు మంగళవారం పలు గ్రామాల నుంచి రైతులు, యువత తరలివచ్చి సంఘీభావం తెలియజేశారు.ఈ సందర్భంగా నల్లజెండాలతో నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా జిల్లా రైతుసంఘ ఉపాధ్యక్షుడు చల్లాజగన్ పాల్గొన్నారు.

ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచాలి: పీడీ

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణి ఆదేశించారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల మహిళా సమాఖ్య నుంచి సామాజిక పెట్టుబడి నిధి (సీఐఎఫ్) కింద రూ.6.64 కోట్లు లక్ష్యంగా కాగా ఇప్పటివరకూ 652 మహిళా సంఘాలకు రూ 5.41 లక్షలు వివిధ అవసరాలు నిమిత్తం బయో మెట్రిక్ పద్ధతిలో రుణాలు మంజూరుచేసినట్లు తెలిపారు.

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి : కమిషనర్

విజయనగరం టౌన్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు శిబిరం వద్దకు ఆయన వెళ్లి వారితో మాట్లాడారు. వారి డిమాండ్లను తెలుసుకున్నారు. తాను ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తక్షణమే సమ్మె విరమించి అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరారు.

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు


బాలాలయం వద్ద అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

విజయనగరంకల్చరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి):పైడిమాంబ దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. చదురుగుడివిస్తరణ పనుల నేపథ్యంలో ఆలయం పక్కనే బాలాలయం నిర్మించి అందులో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, కలశలను ప్రతిష్ఠించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి బాలాలయంలో అమ్మ వారి దర్శనానికి భక్తులు అవకాశంకల్పించారు. చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చదురు గుడిలో దర్శనాలు నిలిపివేయడంతో పక్కనఉన్న బాలాలయంలో ఉన్న అమ్మవారి దర్శనానికి క్యూకట్టారు. ఆలయం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు బాలాలయం వద్ద అమ్మవారి దర్శనం చేసుకొని భక్తులకు ఆశీర్వచనం అందించారు.

పోలీసుల కుటుంబాలకు చేయూత: ఎస్పీ

విజయనగరం క్రైమ్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో మరణించిన పోలీసుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు, స్వచ్ఛందంగా ముందుకొచ్చి కొంతనగదును పోగుచేసి వారి చేయూతగా అందించడం అభినందనీయమని ఎస్పీ దామోదర్ తెలిపారు. జిల్లా పోలీస్‌శాఖలో విధి నిర్వహణలో అనారోగ్యంతో మృతిచెందిన ఎస్ఐ శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు సహోద్యోగులు పోగుచేసిన రూ.1.48,000 చెక్కును, అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్ నాగభూషణ రావు కుటుంబానికి పోలీస్ ఉద్యోగులు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దాచుకున్న రూ.1.18.794 చెక్కు, మరో రూ.30 వేలు చెక్కును నాగభూషణరావు సతీమణి రెడ్డి ధనలక్ష్మికి ఎస్పీ దామోదర్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీపీవో ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యనందించాలి

రాజాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో విద్యనందించాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ విమలరాణి కోరారు. మంగళవారం మునిసిపాలిటీ పరిధిలోని కాకర్లవీధి, కుమార్‌వీధి, మెంతిపేట, అమ్మవారి కాలనీ, మాదిగవీధి కేంద్రాలను తనిఖీచేశారు.

అనధికార కట్టడం తొలగింపు

● అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలు: కమిషనర్

విజయనగరం టౌన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలోని ప్రేమ సమాజం వద్ద అనధికార కట్టడాన్ని నగరపాలక సంస్థ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ మేరకు నిర్మాణ సామగ్రిని స్వాధినం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.నల్లనయ్య తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో కార్పొరేషన్ అధికారులు అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి లేని అక్రమకట్టడాలు జరిగితే ఉపేక్షించేదిలేదని స్పష్టంచేశారు. నగర క్రమబద్ధీకరణలో భాగంగా ఏ ఒక్క అనధికార నిర్మాణాన్ని అనుమతించబోమని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

డోలపేట సమీపంలో..

రాజాం, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి): రాజాం మునిసిపాలిటీ పరిధిలోని డోలపేట సమీపంలో అక్రమ నిర్మాణాలను అధికారులు మంగళవారం రాత్రి తొలగించారు. కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయాన్ని గుర్తించిన అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. పట్టణ ప్లానింగ్ అధికారి శాస్త్రీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పూల్‌బాగ్‌లోని అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

రేపు ప్రమాణ స్వీకారం

భోగాపురం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు నెల్లిమర్ల నియోజకవర్గంలో పార్టీకి సంబందించి మండల, క్లస్టర్, యూనెట్, భూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నెల్లిమర్ల నగర పంచాయతీలో నిర్వహించనున్నామని పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి నియమితులైన మండల, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

13న ఉపకరణాల గుర్తింపు శిబిరం

మెరకముడిదాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గరివిడి మండలంలోని కొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 13న దివ్యాంగుల ఉపకరణాల కోసం గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు ఎం.చంద్రశేఖర్, ధర్మశ్రీనులు తెలిపారు. 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీకి వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు.

14 నుంచి రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

నెల్లిమర్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడలో ఈనెల 14నుంచి మూడురోజులపాటు రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతాయని నిర్వాహక కమిటీ ప్రతినిధి, టీడీపీ నేత సువ్వాడ రవిశేఖర్ తెలిపారు. మంగళవారం కొండవెలగాడలో విలేకరులతో మాట్లాడుతూ పోటీలకు రాష్ట్రం లోని 26 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు.పోటీల విజేతలు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో టీడీపీ నెల్లిమర్ల మండల కమిటీ అధ్యక్షులు కడగల ఆనందకుమార్, పార్టీ జిల్లాకార్యదర్శి లెంక అప్పలనాయుడు, దంతులూరి అజయ్ బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కష్టానికి తగిన గుర్తింపు

లక్కవరపుకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టానికి తగిన గుర్తింపు లభించిందని, ఆ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే లలితకుమారి, ఎంపీ భరత్‌లకు రుణపడి ఉంటామని ఎస్.కోట మండల పార్టీ నూతన అధ్యక్షుడు డోకుల అచ్చెంనాయుడు, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లగా నియమితులైన నానిగిరి రమణాజీ, బంగారు నాయుడులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే ఎల్.కోటలో వీరు కార్యకర్తలు, నేతలతో కలిసి ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ జట్టుకు ఇద్దరి ఎంపిక

తెర్లాం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిటి, ఎన్.బూర్జవలస గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు బీసీసీఐ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. ఆమిటికి చెందిన తెర్లి శివరామకృష్ణ అండర్-19 జట్టుకు, ఎన్.బూర్జవలసకు చెందిన పైల విఘ్నేష్ అండర్ -14 జట్టుకు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువకులు క్రికెట్ జట్టులో స్థానం సంపాదించినందుకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనతోపాటు పలువురు అభినందిచారు.

ఖోఖో పోటీలకు..

గజపతినగరం, నవంబరు11(ఆంధ్రజ్యోతి):గంగచోళ్లపెంట విద్యార్థిని తామాడ పూర్ణిమ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.బంగార్రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో విజయనగరంలో విజ్జీ స్టేడియంలో జరిగిన అండర్ -19 రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా ద్వితీయస్థానం సాధించడంలో కీలకంగా వ్యవహరించిన తామాడపూర్ణిమ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. వచ్చే నెలలో మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.ఈ మేరకు పీడీ సత్యనారాయణను అభినందించారు.

ఇళ్ల కోసం సర్వే

మెరకముడిదాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):గ్రామీణపేదలకు గృహ వసతి కల్పించేందుకు అర్హులైన లబ్దిదారులను గుర్తించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల సర్వే చేస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ ఏఈ మురళి తెలిపారు.గ్రామీణ పథకం 2.0 కిందడ పేదలకు మండల పరిధిలో గృహ వసతి కల్పనకు ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు ఏఈ మురళి మంగళవారం వర్క్ ఇన్‌స్పెక్టర్లు మజ్జి శ్రీనివాసరావు, పప్పల శ్రీనివాసరావులతో కలిసి మెరకముడిదాంలో ఇళ్ల సర్వేను నిర్వహించారు.

వేగావతి నదిలో పడి యువకుడి మృతి

సాలూరు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెట్టువీధికి చెందిన కొయ్య దినేష్ (19) వేగావతి నదిలో పడి మృతిచెందాడు. పట్టణ సీఐ అప్పలనాయుడు కథనంమేరకు.. పట్టణంలో మెట్టువీధిలో నివాసముంటున్న నాన్నమ్మ కొయ్య బూర్జమ్మవద్ద దినేష్ ఉంటున్నాడు.దినేష్ తల్లిదండ్రులు గతంలో చనిపోవడంతో నాన్నమ్మతోపాటు ఉంటున్నాడు. అయితే సోమవారంరాత్రి బహిర్భూమికి వెళ్లిన దినేష్ వేగావతినది పక్కన మంగళవారంఉదయం విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అదే సమయంలో దినేష్ ఇంటిలో కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్న బూర్జమ్మకు స్థానికులువిషయాన్ని తెలిపారు.దినేష్‌కు ఫిట్స్‌ఉందని, మద్యం తాగుతుంటాడని ఆ ఫైకంలో బహిర్భూమికి వెళ్లి మృతి చెందడంపై బూర్జమ్మ కన్నీరుమున్నీరైంది. పట్టణ పోలీసులు కేసునమోదు చేశారు.

కరకవలసలో వ్యక్తి ఆత్మహత్య

గంట్యాడ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకవలసకు చెందిన షిండే తేజ(29) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సాయి కృష్ణ కథనం మేరకు.. షిండే తేజ ఇంట్లో ఒక్కడే నివసిస్తున్నాడు. నాలుగైదు రోజులుగా బయటకి వెళ్లి వస్తుండేవాడు. ఆయన తల్లి ముంబైలో నివసిస్తోంది.ఈనేపథ్యంలో షిండే తేజ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

దత్తిరాజేరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరడాం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందినట్లు స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మరడాం సమీపంలో ఆదివారం ఆగిఉన్న లారీని స్కూటీతో ఢీకొన్న ప్రమాదంలో గొటివాడఅభిషేక్(20), కడియాలసుశాంత్‌లు గాయాలపాలయ్యారు.గొటివాడ అభిషేక్‌కు తలకు బలమైన గాయాలు కావడంతో విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం,నవంబరు11(ఆంధ్రజ్యోతి):మండలంలోని జిన్నాంలో అదేగ్రామానికి చెందిన రాంబాబు అక్రమంగా అమ్మకాలు చేపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో దాడిచేసి ఏడు మద్యం సీసాలు స్వాధీనంచేసుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ నరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు.ఈమేరకు కేసునమోదు చేసినట్లు చెప్పారు. సీఐ జనార్దన్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోగల 16 మద్యం షాపుల్లో నకిలీ మద్యం అమ్మకాలకు ఆస్కారం లేకుండా శాంపిల్ తీసి నాణ్యత పరిశీలించినట్లు చెప్పారు.కార్యక్రమంలో హెచ్‌సి.బాషా, సిబ్బంది అప్పారావు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జామి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వ్యక్తి ఎస్.కోట న్యాయస్థానం సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏడురోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. ఎస్.కోటమండలంలోని కొట్టాంగ్రామానికి చెందిన ఎర్రినాయుడు స్కూటీపై వస్తుండగా ఆపి బ్రీతింగ్ పరీక్ష చేయగా మద్యం సేవించినట్లు గుర్తించి, కేసు నమోదుచేశామన్నారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా ఏడురోజుల జైలు శిక్ష విధించారని చెప్పారు.

పోరాంలో కొట్లాటపై కేసుల నమోదు

రేగిడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పోరాంలో సోమవారం రాత్రి ఇరు కుటుంబాల మధ్య కొట్లాట చోటుచేసుకొంది. ఈఘటనలో ఇరు కుటుంబాలకు చెందిన లెంక రుద్రవేణి, లెంక గోవిందనాయుడు, బొక్కేలు పట్టాభినాయుడుకు స్వల్పగాయాలయ్యాయి.వీరు రాజాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పరస్పర కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. లెంక సత్యనారాయణ, బొక్కేలు పట్టాభినాయులు ఎదురెదురుగా నివసిస్తున్నారు. వీరిమధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈఘటనలో వీరు స్లాబ్‌పోటీకర్రలతో ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఈదాడిపై ఒక కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుపై ఉపాధ్యాయుడు బొక్కేలు శ్రీకాంత్, పట్టాభినాయుడులపై కేసు నమోదుచేయగా, మరో కుటుంబం ఇచ్చిన ఫిర్యాదులో లెంక సత్యనారాయణ, లెంక గౌరినాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్యసిబ్బందిని వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

ఎస్.కోటరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):కొట్టాం పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న వైద్యసిబ్బందిని వేధిస్తున్న ఎల్.కోట మండలం ఖాసాపేటకు చెందిన ఎర్నాయుడును అరెస్ట్‌చేసినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. ఎర్నాయుడు కొంతమంది వైద్యసిబ్బందిని ఉద్యోగం పోయేలా చేస్తానని బెదిరిస్తున్నాడని సిబ్బంది ఫిర్యాదు చేశారని చెప్పారు. తిమిడి ప్రతాప్ రెడ్డి చెరువువద్ద ఎర్నాయుడును అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారని తెలిపారు.

ఆరు వాటర్ ప్లాంట్లపై కేసుల నమోదు

విజయనగరం రింగ్‌రోడ్డు,నవంబరు11 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పలు వాటర్‌ప్లాంట్లపై మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి, నిబంధనలు పాటించని ఆరు ప్లాంట్లపై కేసులు నమోదుచేశారు. ఈసందర్భంగా ఓ ప్లాంట్‌లో బీఐఎస్ నిబంధనలు పాటించకపోవడంతోపాటు నీటిలో పీహెచ్‌శాతం నిర్ణీత ప్రమాణాల కంటే అధికంగా ఉన్నట్లుగా గుర్తించారు. ఈసందర్భంగా ఫుడ్‌సేఫ్టీ అధికారి నాగుల్‌మీరా మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా నీటిని అమ్ముతున్నారని,ప్లాంట్లకు లైసెన్స్‌లు కూడా లేవని తెలిపారు.

మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా రాము

గజపతినగరం,నవంబరు11(ఆంధ్రజ్యోతి):గజపతినగరం అగ్ని గంగమ్మ మత్స్యపారిశ్రామిక సహకారసంఘం ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి.జిల్లా మత్స్యశాఖ కార్యాలయం ఏడీ శేషమ్మ ఎన్నికల అధికారిగా ఎన్నికలునిర్వహించగా సొసైటీ అధ్యక్షుడిగా మాతాబోయినరాము, ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ అధికారి చండీప్రియ పాల్గొన్నారు.

సీతారామ స్వదేశీ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా దుర్గారావు

వంగర, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీతారామ స్వదేశీ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా పెనుబోతు దుర్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కోట్టిశ యూపీ పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో మత్స్యకార సొసైటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మజ్జ గణపతి,కార్యదర్శులుగా తవిటందొర, నరసింహమూర్తి, జాను సూరయ్యతో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

చెట్ల నరికివేతపై డీఆర్వోకు నివేదిక

ఎస్.కోటరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తాటిపూడి బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో చెట్లనరికివేతపై డీఆర్వోకు నివేదిక అందజేయనున్నట్లు గార్డు శ్రీనివాసరావు తెలిపారు.ఈమేరకు డీఆర్వో రవికుమార్ ఆదేశాల మేరకు గార్డు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరికిన చెట్లు పరిశీలించి, కొలతలు తీసుకున్నారు. కాగా చెట్లు నరికివేతపై జిల్లా అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ఫిర్యాదు చేయనున్నట్లు పర్యావరణవేత్త బొబ్బిలి రామకృష్ణ తెలిపారు.మంగళవారం గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా తేజ్ భరత్

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మెట్రోపాలిటన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ఎన్.తేజ్ భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ప్రస్తుతం మెప్మా డైరెక్టర్‌గా విజయవాడలో పనిచేస్తున్నారు.ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న విశ్వనాథన్‌ను గత నెల తొమ్మిదో తేదీన ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీచేసిన సంగతి తెలిసిందే. విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి తరచూ వెళుతున్నా పెట్టుబడుల సదస్సు కారణంగా వీఎంఆర్‌డీఏపై పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమయ్యేలోగా ఏడు మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మించే బాధ్యతను ప్రభుత్వం వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. విశ్వనాథన్ వెళ్లిన తర్వాత ఆ పనుల్లో పురోగతి లేకుండా పోయింది. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో పూర్తిస్థాయి అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఈసారైనా కని'కరి'స్తారా?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వానికి నివేదికలు అందిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతూవస్తున్నారు. నష్టం ఎక్కువగా ఉంటున్నా పరిహారం మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువగా చెల్లిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఏనుగులతో జిల్లాలో ఇంతవరకు 27 మంది మరణించగా, ముగ్గురు గాయపడ్డారు. అలాగే వివిధ ప్రమాదాలకు గురై 11 ఏనుగులు కూడా మృత్యువాత పడ్డాయి. గత 27 ఏళ్లలో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

ఐదు చోట్ల స్థలాల పరిశీలన..

ఏనుగుల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు సంకల్పించారు. ఈ మేరకు 2010లో విజయనగరం, శ్రీకా కుళం జిల్లాల అటవీశాఖ అధికారులు దేశంలోని మొట్టమొదటి ఏకైక ఎలిఫెంట్ కన్జర్వేషన్ అండ్ కేర్ సెంటర్ (ఈసీసీసీ)ను సందర్శించారు. రిజర్వు ఫారెస్ట్ వెలుపల ఉన్న ఏనుగులను నిర్బంధించిన సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను పూర్తిగా తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏనుగుల పునరావాస కేంద్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన ప్రారంభించారు. ఇందులో భాగంగా కొమరాడ మండలం అర్తాం రిజర్వ్ ఫారెస్ట్, పార్వతీపురం వైపు ఉన్న నాగావళి నది పరివాహక ప్రాంతం, జియ్యమ్మవలస మండలం వట్టిగెడ్డ రిజర్వాయర్ పరివాహక ప్రాంతం, కురుపాం మండలంలోని బోడి కొండ, మక్కువ మండలంలోని జంతి కొండ ప్రాంతాలను పరిశీలించారు. కానీ ఆ ప్రాంతాల గిరిజనుల నుంచి తీవ్ర వ్యతిరేక రావడంతో పాటు కావల్సిన భూమిని రెవెన్యూశాఖ సమకూర్చకపోవడంతో ఆయా ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు నత్తనడకలా తయారయ్యింది.

పునరావాస కేంద్రంలో ఇవి ఉండాలి..

● ఏనుగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు వంద నుంచి 200 హెక్టార్లతో అనువైన ప్రాంతం ఉండాలి. ● అందులో 75 నుంచి 100 హెక్టార్లు నీటి వనరులు ఏర్పాటు చేయాలి. ● మూడేళ్లకు సరిపడ ఆహారాన్ని ఏనుగులకు అందించి ఆ ప్రాంతాన్ని వాటికి అలవాటు చేయాలి. ● గడ్డి, చెరకు, పండ్ల జాతి మొక్కలను పెంచాలి. వీటితో పాటు ఇతర అటవీ జాతుల విస్తీర్ణం పెంచి అందులో ఏనుగులకు అనువైన వెదురు ఆవాసాలు పెంచాలి.● నీటి లభ్యత పెంచడం కోసం సోలార్ బోర్లు ఏర్పాటు చేసి భారీ ఊట చెరువులు నిర్మించాలి. ● ఏనుగులు ఉండబోయే మొత్తం ప్రాంతానికి చుట్టూ ఇనుప రైలింగ్‌తో పాటు కంచె ఏర్పాటు, ఇరువైపులా పెద్ద కందకాలు తవ్వాలి.

ఎట్టకేలకు సీతానగరం మండలంలో..

ఏనుగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు ఎట్టకేలకు సీతానగరం మండలం గుచ్చిమి, అప్పయ్యపేట, జోగింపేట సమీపంలోని రిజర్వ్ ఫారెస్టు ప్రాంతాన్ని అధికారులు గుర్తించారు. దీని ప్రతిపాదనలు అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి పంపగా రూ.2కోట్లు విడుదల చేశారు. అయితే, ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2024-25 సంవత్సరంలో పునరావాస కేంద్ర పనులకు రూ.76 లక్షలు ఖర్చు చేశారు. 2025-26లో మిగిలినది ఖర్చు చేస్తారని అటవీశాఖ ఉన్నతాధికారి తెలిపారు. అక్కడ 40 హెక్టార్ల స్థలాన్ని పరిశీలించి ఇంకా కావల్సిన ప్రభుత్వ భూమిని రైతుల వద్ద నుంచి సమకూర్చారు. ఈ పునరావాస ప్రాంతం ఏర్పాటయితే జిల్లా వాసులకు ఏనుగుల కష్టాలు తప్పినట్లేనని అధికారులు అంటున్నారు. దీంతో పునరావాస కేంద్రం ఎప్పుడు పూర్తవుతుందోనని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

4 నెలల్లో పూర్తి చేస్తాం..

ఏనుగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు సీతానగరం మండలం గుచ్చిమి సమీపంలో జోగింపేట, అప్పయ్యపేట గ్రామాల పరిధిలో రిజర్వ్ ఫారెస్ట్ గుర్తించాం. మరో నాలుగు నెలల్లో పునరావాస కేంద్రం పూర్తి చేస్తాం.

-మణికంఠేశ్, ఎలిఫెంట్ మానటరింగ్ యూనిట్ అధికారి, పార్వతీపురం

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి)

వెంకటభైరిపురం ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఓపీ, మందుల రిజిస్టర్లను పరిశీలించారు. దోమకాటుతో సోకే మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించి ప్రచారం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరుపై కలెక్టర్ మరోసారి ఆరాతీశారు. గర్భిణులు, చిన్నపిల్లల ఆరోగ్యరక్షణపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, వారికి అవసరమైన అన్నిరకాల టీకాలు, పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు కె.రాబర్టు పాల్, కె.సత్యనారాయణరెడ్డి, మండల వ్యవసాయాధికారి చింతల భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం


(5వ పేజీ తరువాయి)

జత కాలిఫ్లవర్‌లు రూ.50, కాకరకాయలు రూ.80, గోరుచిక్కుడు రూ.80, ఉల్లిపాయలు కిలో రూ.30, బంగాళాదుంపలు కిలో రూ.30 చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూరగాయలు కొనేందుకు జంకుతున్నారు.

అదే కారణం..

జిల్లాలో వీరఘట్టం, జియ్యమ్మవలస, కురుపాం, గరుగుబిల్లి, సాలూరు, పాచిపెంట, మక్కువ, పార్వతీపురం తదితర మండలాల్లో వివిధ రకాల కూరగాయలను రైతులు విరివిగా పండిస్తుంటారు. ఈ ఏడాది అధిక వర్షాలు కురవడంతో పాటు ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్‌తో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. స్థానికంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. దీనివల్ల ధరలను పెంచి అమ్ముతున్నారని ప్రజలు వాపోతున్నారు. కార్తీక మాసంలో మాంసం వినియోగం తక్కువగా ఉంటుంది. కూరగాయలనే అధికంగా వినియోగిస్తుంటారు. ఇది కూడా కూరగాయల ధరలు పెరగడానికి ఒక కారణమని వ్యాపారులు అంటున్నారు.

మాక్ పార్లమెంట్ ప్రత్యేక అనుభూతి



మాక్ పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మాక్ పార్లమెంట్ నిర్వహణలో విద్యార్థులు పాల్గొనడం వారికి ఎంతో అనుభూతి నిస్తుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం బిర్సాముండ 150 జయంతి, జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. చట్టసభల్లో ప్రభుత్వాలు చేసే చట్టాలు, అమలు, తీర్మానాలు, ప్రతిపక్షాల వాదోపవాదాలు వంటి అంశాలను గిరిజన విద్యార్థులు చక్కగా ప్రదర్శించారు. ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ.. చక్కగా చదువుకుంటే మంచి అవకాశాలు మిమ్మల్ని వెదుక్కుంటు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్, డిప్యూటీ ఈవో రామ్మోహనరావు, డీడీ అన్నాదొర, ఏవో సునీల్, ఇన్‌చార్జి ఏటీడబ్ల్యువో సూర్యనారాయణ, జీసీడీవో రాములమ్మ, హెచ్‌ఎం కోటిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై దృష్టి పెట్టండి



డాక్టర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

సీతానగరం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యంతో పాటు స్వచ్ఛతపై ఆరోగ్య సిబ్బంది దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆన్‌లైన్ హాజరు, రోగుల వివరాలు నమోదు, గర్భిణులకు అందిస్తున్న సేవలపై వైద్యాధికారి ఉషారాణిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీవో వెంకటరావు ఉన్నారు.

గొప్ప విద్యావేత్త మౌలానా ఆజాద్



ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి: భారతదేశ విద్యావ్యవస్థకు పునాదులు వేసిన మహానుభావుడు, గొప్ప విద్యావేత్త మౌలానా ఆజాద్ అని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. మౌలానా జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకుని విద్యా వ్యవస్థకు బలమైన పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ రమణమూర్తి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు అభినందనలు



శివకుమార్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కళింగ కోమటి, కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ వారణాసి శివకుమార్‌ను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మంగళవారం అభినందించారు. క్యాంప్ కార్యాలయంలో ఆయిన్న సత్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి మంచి పదవులు దక్కుతాయన్నారు. ఇటీవల నియోజకవర్గంలో పలువురు పదవుఖు పొందడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు కద్రక మల్లేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గార గౌరీశంకర్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, జియమ్మవలస మండల టీడీపీ కన్వీనర్ జోగి భుజంగరావు, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, సుమన్, అప్పలకొండ, ప్రకాశరావు, యాకోబు, సింహాచలం తదితరులున్నారు.

నేడు ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

●చైర్మన్‌గా చినతిరుపతి?

మక్కువ రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. రెండేళ్ల కాల పరిమితితో 10 మందిని ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులుగా నియమిస్తూ ఇటీవల దేవాదయ, ధర్మాదయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆలయ ఈవో బి.శ్రీనివారావు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరుకానున్నారు. అయితే ఆల య ట్రస్టు బోర్డు చైర్మన్‌గా నైదాన చినతిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రస్టే బోర్డు సభ్యుల్లో మెజార్టీ సభ్యులు చినతిరుపతినే చైర్మన్‌గా ఎన్నుకునేందుకు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది. టీడీపీ మండల అధ్యక్షుడు గుల్లవేణుగోపాలనాయుడు మ ద్దతుతో పాటు మంత్రి సంధ్యారాణి ఆశీస్సులు చినతిరుపతికి ఉండటంతో ఆయనే చైర్మన్‌గా ఎన్నిక కానున్నారనే ప్రచారం జరుగుతోంది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు రంజిత్



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భామిని, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న కేవాటి రంజిత్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎ.మల్లేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్ అండర్-14 విభాగంలో రంజిత్ 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం, లాంగ్‌జంప్‌లో ద్వితీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి వ్యాయామ ఉపాధ్యాయుడు అలికాన శంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధి పనులపై ఆరా

భామిని, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నీతి ఆయోగ్ సౌత్ ఛానెల్ కో-ఆర్డినేటర్ లోకేశ్ ఆరా తీశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం బొడ్డగూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని కంటైనర్‌లో నిర్వహించడంపై సిబ్బందితో మాట్లాడారు. వచ్చే వేసవిలో వేడి ఎక్కువగా ఉంటుందని, దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే తాగునీరు, జలజీవన్ మిషన్ పనులు పరిశీలించారు. పనుల్లో జాప్యం జరుగుతున్నట్టు గుర్తించారు.ఆయనతో పాటు ఎంపిడివో ఎస్.వసంతకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్‌కుమార్, ఐసీడీఎస్ పీవో శాంతిభవానీ పాల్గొన్నారు.

మునక్కాయవలసలో వైద్య శిబిరం

పార్వతీపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మునక్కాయవలసలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని వైద్యులు నిర్వహించారు. డోకిశిల వైద్యాధికారి డాక్టర్ మేఘన శిబిరాన్ని నిర్వహించారు. డోకిశిల ఆశ్రమ పఠశాలలో చదువుతున్న విద్యార్థినికి జ్వరం వచ్చినట్టు సమాచారం రావడంతో వెంటనే గ్రామానికి వెళ్లి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కె.సత్యం ఆదేశాలు మేరకు గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. కార్య క్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పాపారావు తదితరులు పాల్గొన్నారు. జ్వరం వచ్చిన కె.నవ్య ఆరోగ్యం బాగానే ఉందని డిప్యూటీ ఎంపిడివో పాపారావు తెలిపారు.

తూముల రమేశ్‌కు అభినందనలు

వీరఘట్టం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం మేజర్ పంచాయతీ చెందిన తూముల రమేష్ కళింగ కోమటి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దాంతో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, చింతా ఉమా, గౌరునాయుడు, అచ్యుత తదితరులు అభినందనలు తెలిపారు.

పర్యాటకానికి స్వర్గధామం మన్యం

(5వ పేజీ తరువాయి)

చేసేందుకు, వారికి సౌకర్యాలను కల్పించేందుకు ఈ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అందుకుగానూ గిరిజనులకు రూ.3నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. జిల్లాలో 98 రోడ్ల నిర్మాణానికి రూ.28 కోట్ల నిధులు మ ంజూరు చేశామని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, సీఐ రామకృష్ణ, టీడీపీ మండల అధ్య క్షుడు ఆముదాల పరమేశు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టాభిని కలిసిన విజయచంద్ర



పట్టాభితో ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో ఆయనను కలిసి పార్వతీపురంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్‌యార్డును పరిశుభ్రం చేయించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పట్టాభి వచ్చే వారం పార్వతీపురంలో పర్యటించి కొత్త ప్రాసెస్ యూనిట్ మంజూరుతో పాటు డంపింగ్‌యార్డు క్లీనింగ్ పనులు చేయిస్తాననని హామీ ఇచ్చారు. దాంతో స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే పార్వతీపురానికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ యూనిట్ మంజూరు కానుందని, ప్రస్తుతం ఉన్న డంపింగ్‌యార్డు ప్రదేశం క్లియర్ చేసి పార్క్ ఏర్పాటుకు అంగీకారం కుదిరిందని ఈ సందరంగా ఎమ్మెల్యే తెలియజేశారు.

గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

పార్వతీపురం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ సదా భార్గవితో ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర మంగళవారం భేటీ అయ్యారు. అమరావతిలో కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే ట్రైకార్ నిధులు వెంటనే మంజూరు చేయించాలన్నారు. వ్యవసాయ పనిముట్లుకు అవసరమైన వనరులు సమకూర్చాలన్నారు. గిరిజన రైతులకు రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గిరిజన సంక్షేమ శాఖ నిధులను త్వరగా విడుదల చేసి గిరిజనుల అవసరాలు తీర్చాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

నకిలీ వస్తువులతో మోసగిస్తే కఠిన చర్యలు

సాలూరు రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంతల్లో నకిలీ వస్తువులతో గిరిజనులను మోసగిస్తే కఠినచర్యలు తప్పవని సాలూరు జీసీసీ బ్రాంచి మేనేజర్ సీహెచ్.రాములు హెచ్చరించారు. గిరిజన నేత బిర్సాముండా జయంత్యుత్సవాలు పురస్కరించుకుని పార్వతీపురం ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నేరేళ్లవలస సంతలో జీసీసీ ఆధ్వర్యంలో ఆయన గిరిజన సంతను సందర్శించారు. నిర్వహించారు.. కార్యక్రమంలో సేల్స్‌మేన్లు రమేష్, మహేష్, గంజాయిభద్ర గిరిజన నేత గెమ్మెల బీసు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ ఉత్పత్తులపై విస్తృత ప్రచారం

కురుపాం రూరల్, నవంబరు11 ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా విక్రయిస్తున్న పలు ఉత్పత్తుల కోసం మంగళవారం మొండెంఖల్ వారపు సంతలో అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. వారపు సంతలో గిరిజనులు నకిలీ వస్తువులు ఒని మోసపోవద్దన్నారు. జీసీసీ స్టాళ్లలో నాణ్యమైన వస్తువులు సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం రామారావు, బ్రాంచ్ మేనేజరు ఎస్.రాము, గోదాం ఇన్‌చార్జి తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై శిక్షణ

పాలకొండ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలనపై ఒక్కరోజు శిక్షణను మంగళవారం సిబ్బందికి ఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి శిక్షకులుగా ఎల్.వెంకటేశ్వరరావు, సుధీర్‌బాబు, మన్యం జిల్లా కో-ఆర్డినేటర్ గణపతమ్మ శిక్షణ ఇచ్చారు.

ఈ-పంట నమోదు పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న జేసీ

సీతానగరం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కాశీపేట గ్రామంలో సూపర్ చెక్‌లో భాగంగా ఈ-పంట నమోదును జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర సిబ్బంది నమోదు చేసిన వివరాలను పరిశీలించి సంతృప్తి కలిగిందన్నారు. రైతులతో మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం నిర్దేశించిన ధరను పొందాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసన్నకుమార్, వ్యవసాయాధికారి అవినాష్ ఉన్నారు.

ఆశాలు కీలకంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ జగన్మోహన్‌రావు

పార్వతీపురం రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు సర్వేలు చేపట్టడంలో కీలకంగా వ్యవహరించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మంగళవారం పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యకమాల ద్వారా వైద్యసేవలు అందుతున్న తీరుపై సమీక్షించారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేశారు. బాలల ఆరోగ్యానికి చెందిన ఏఎఫ్‌హెచ్‌సీ క్లినిక్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి.ధరణి, సూపర్‌వైజర్ టి.వెంకటనాయుడు, జయలక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

గరుగుబిల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో జ్వరాలు సంఖ్య పెరిగే అవకాశం ఉందని, జ్వరాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా వైద్యాధికారి తిరుమలప్రసాద్‌కు తో మాట్లాడారు. అనంతరం పె ద్దూరు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.పరిశీలనలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

కొమరాడ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా లంజి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రాంతాల నుంచి గర్భిణులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు రాకపోకలు సాగించేదుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

160 మందికి నేత్ర పరీక్షలు

పాలకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):స్థానిక సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటైంది. విశాఖ పట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్యులు 102 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. అందులో 42 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సేవాసమితి కన్వీనర్ సుధాకర్, సూర్యారావు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

మక్కువ, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రభాకరరెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం రాత్రి మక్కువ మండల కేంద్రంలో నాలుగు రోడ్ల జంక్షన్‌లో పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాపారులు.. దుకాణాల ముందర తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. చెత్తను రోడ్లపై పారబోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అర్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

భామిని, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): భామినిలో మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం దిమ్మిడిజోలలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ పంట తుపాన్ కారణంగా పడిపోవడం, వర్షాలు కారణంగా మొలక వచ్చిందని దళారీలు మొక్కజొన్న క్వింటాకు రూ.1000 నుంచి రూ.1800 మించి కొనడం లేదన్నారు. అనంతరం డీటీ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొత్తకోట బాబూరావు నాయుడు, బొత్స గౌరు, రైతులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గరుగుబిల్లి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వారోత్సవాల నిర్వహణపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.రజనీకుమారి, లైబ్రేరియన్ ఎ.మాధురి, ప్రధానోపాధ్యాయులు ఎం.తేజేశ్వరి పాల్గొన్నారు.

అన్నదానానికి కొండలరావు విరాళం

పాలకొండ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భీమలింగేశ్వస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానానికి టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు రూ.10 వేలు విరాళం మంగళవారం అందజేశారు. షిర్డీసాయినగర్‌లో సకల దేవతల ఆలయం ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

సీతంపేట రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ సమీపంలో ఎస్ఐ అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో ప్రతీ వాహనాన్ని క్షణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో ట్రైనీ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రపు చర్చ

మక్కువ రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రపు చర్చ జరిగింది. సమావేశంలో పలువురు అధికారులు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిం చారు. గ్రామాల్లో ఇల్లు లేని పేదల కోసం సర్వే జరుగుతోందని, ఇంతవరకు ఇల్లు లేని పేదలు సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సింహాచలం తెలిపారు. ఏవో చింతల భారతి మాట్లాడుతూ మొంథా తుఫాన్‌లో దెబ్బతిన్నపంటలకు నష్టపరిహారం అందించేందుకు నిబంధనల ప్రకారం సర్వే నిర్వహిస్తున్నామన్నారు. వర్షాలకు తడిసిన వరి పంటలను గుర్తించి నివేదిక ప్రభుత్వానికి పంపామన్నారు. మండలంలోని 21 పంచాయతీల్లో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని, ఈ నెల 14 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులకు ఎటువంటి విధులు, నిధులు కేటాయించకపోవడంతో ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నామని శంబర ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, కాశీపట్నం ఎంపీటీసీ సభ్యురాలు కోట జయలక్ష్మి సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎన్.అర్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి, నీటి పారుదల ఏఈ బొంగు తిరుపతిరావు తదితరులు హాజరయ్యారు.